తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ఆలయాల నిర్మాణం, దళారీ వ్యవస్థ కట్టడికి

శ్రీవాణి ట్రస్ట్ దర్శన విధానం
-రూ.139కోట్లతో ఆలయాల పున:నిర్మాణం
-టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి,ఇఒ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల,జూన్ 23 ప్రభాతవార్తప్రతినిధి: దేవవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల్లో మతమార్పిడిలు అరికట్టేందుకు, హిందూ ఆలయాల నిర్మాణంతో బాటు దర్శన దళారీల వ్యవస్థను కట్టడి చేసేందుకు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దర్శన విధానం అమలు చేయడం జరిగిందని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి మీడియాకు వివరించారు. ఈ సదుద్దేశ్యంతోనే 2019నుంచి శ్రీవాణి ట్రస్ట్ద్వారా విరాళాలు సేకరణ చేపడుతున్నామన్నారు. ంధ్రప్రదేశ్,తెలంగాణా, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలో 139కోట్ల రూపాయలతో పురాతన ఆలయాల పునః నిర్మాణం చేశామని తెలిపారు. 2,273 ఆలయాలు, గోశాలలు, భజన మందిరాలు నిర్మాణానికి 227కోట్లు కేటాయించామని చెప్పారు. రాజకీయ ఆరోపణలు తప్ప ఒక్క దాతకూడా విరాళాలపై ఆరోపణలు చేయలేదన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఆరోపణలుచేసే వారిపైచట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశవిదేశాల నుంచి వచ్చేభక్తులను దళారీలు మోసం చేయకుండా ఉండేందుకు శ్రీవాణిట్రస్ట్ను నెలకొల్పడం జరిగిందన్నారు. శ్రీవాణిట్రస్ట్ విరాళాలపై, నిధుల వ్యయంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి మీడియాకు విడుదలచేశారు. నిరాధార ఆరోపణలు చేసే ముందు లక్షలాది మంది భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకోవాలని ఇఒ ధర్మారెడ్డి కోరారు.

# కుప్పంలో చంద్రబాబును ఓడిస్తాం!

- పేదల బ్రతుకుల్లో వెలుగులు నింపుతున్న సిఎం జగన్ - ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటుపొడిచారు
- ఆ కుటుంబాన్నే పక్కనపెట్టారు - జగన్‌కు భయపడే కుప్పం వస్తున్నారు -గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బెగ్గిలపల్లి సభలో ప్రసంగిస్తున్న మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం (గుడుపల్లె) జూన్ 23 ప్రభాతవార్త : రా ష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల బ్రతుకుల్లో వెలుగులు నింపుతున్నారని రాష్ట్ర అటవీ, గనులు, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుడుపల్లె మండలంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి బెగ్గిలపల్లిలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రజలు అంతా ఎన్నికల్లో వైకాపాకు ఓట్లు వేసేందుకై ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పేద ప్రజల సమస్యలను పరిష్కరించాలని తాను కుప్పం నియోజకవర్గంలో ఐదు రోజుల పర్యటన చేపట్టినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కుప్పానికి ఏడాది అయినా వచ్చేవారు కాదని నేడు జగన్‌కు భయపడి కుప్పానికి వస్తున్నారని విమర్శించారు. చంద్ర బాబు నాయుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారని అనంతరం ఆ కుటుంబాన్నే పక్కనపెట్టారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు అని విమర్శలు చేశారు. కుప్పంలో లక్ష మెజార్టీ అంటున్న చంద్రబాబును కుప్పంలో తాము 30వేల ఓట్లతో ఓడిస్తామని పేర్కొన్నారు. కుప్పంలో గెలిస్తే భరత్‌కు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే సిఎం జగన్ ప్రకటించి ఉన్నారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్ యమంత్రిగా గతంలో చంద్రబాబు ఎంతమందికి కుప్పంలో ఇళ్లు కట్టించారని ప్రశ్నించారు. మహిళలకు రుణ మాఫీ అంటూ మోసగించారని మహిళల ఇబ్బందులు గమనించిన సిఎం జగన్ వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నా న్నారు. పిల్లల చదువులపై సిఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆంగ్ల మాధ్యమ్యం అమలు చేస్తూ పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతునా న్నారు. అనంతరం శెట్టిపల్లి, పిబివాడ, యామనూరు, కనమనపల్లి, కెబిపల్లి, గుండ్లసాగరం, అగరం, దాసిమానిపల్లి, పొగురుపల్లి, లక్ష్మీపురంలో మంత్రి పర్యటించారు. మంత్రి పర్యటన సందర్భంగా గ్రామంలో మహిళలు మంత్రికి హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్,కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్,ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, సీనియర్ నేత ఎంఆర్‌సి రెడ్డి, గుడుపల్లె ఎంపిపి వరలక్ష్మి, జడ్పీటిసి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ రామూర్తి, యూత్ అధ్యక్షుడు రవి,ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్,గంగమ్మగుడి ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్, ఆరేళ్ల జయప్ప,నాగభూషణం , సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓడిస్తే...ఊళ్లు వదిలి వెళ్లిపోతాం

- వైకాపా ఓడితే కుప్పంలో అడుగుపెట్టనని రాసిస్తారా..మంత్రికి సవాల్ !! - కుప్పంకు చంద్రబాబు ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధం
-గ్రామాల్లో శిలాఫలకాలు లెక్కిస్తే లెక్కలు పక్కాగా తెలుస్తుంది - ఎమ్మెల్సీ, తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 23 ప్రభాతవార్త : తెదేపా అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడును కుప్పంలో ముప్పై వేల ఓట్లతో ఓడిస్తే తెదేపా శ్రేణులు,తామంతా ఊళ్లు వదిలి వెళ్లిపోతామని అదే వైకాపా ఓడితే కుప్పంలో అడుగుపెట్టనని రాసిస్తారా? అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సవాల్ విసిరారు. శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్ల మీడియాతో మాట్లాడారు. గుడుపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి హాస్యాస్పదమైన ప్రకటన చేశారన్నారు. కుప్పానికి చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారన్నారు. 35 ఏళ్లలో కుప్పంకు చంద్రబాబు ఏం చేశారో బహిరంగ చర్చకు మంత్రి రావాలని సవాల్ విసిరారు. తాము చేసిన అభివృద్ధి ఏంటో గ్రామాల్లోని శిలాఫలకాలే చెబుతాయని కుప్పంలో ఏం అభివృద్ధి చేశామో లెక్కలు పక్కాగా తేలుతాయన్నారు. చంద్రబాబు హయాంలోనే రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించారన్నారు. మండలానికో జూనియర్ కాలేజ్, హైస్కూళ్లు, ద్రవిడ వర్సిటీ, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్‌లతో పాటు వైద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. కుప్పంను విద్యాకేంద్రంగా చంద్రబాబు మార్చారన్నారు. వైకాపా పాలనలో మూడు నెలలుగా ద్రవిడ వర్సిటీ ఉద్యోగులకు జీతాలు లేకుంటే చంద్రబాబు నాయుడు గవర్నర్‌కు లేఖ రాసే వరకు జీతాలు పడలేదని పేర్కొన్నారు. తెదేపా హయాంలో తొంభై శాతం పూర్తయిన హంద్రీ-నీవా కాలువ పనులు మిగతా పదిశాతం ఎందుకు పూర్తి చేయలేదని ఇది మంత్రి చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. తకుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఆగాయని ఇదివరకే బిల్లుల కోసం కౌన్సిలర్లు కమీషనర్, మున్సిపల్ ఛైర్మన్‌తో గొడవలకు దిగలేదా అని ప్రశ్నించారు. మరో పక్క వైసిపి సర్పంచులు కూడా బిల్లుల కోసం ధర్నాలు చేయలేదా అని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి వాస్తవాలు మాట్లాడాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఆర్. చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్, డా॥ వెంకటేష్, మునస్వామి, త్రిలోక్, శాంతారాం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

జేసి డికె బాలాజీ

తిరుపతి కలెక్టరేట్, జూన్ 23, ప్రభాతవార్త : అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు అందక పొరపాటున మిగిలిన వారికి తలుపు తట్టి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని జిల్లాలో ఈ నెల 24 నుండి పగడ్బందిగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ సురక్ష కార్యక్రమాన్ని వివరించి, ప్రారంభించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి సత్యవేడు శాసన సభ్యులు ఆదిమూలం, జేసి, డిఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఆర్డిఓలు కనకనరసారెడ్డి, రామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో సమావేశమై, మండల స్థాయి వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించి మండల స్థాయి అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అని, ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 నుండి కొన్ని మండలాలలో సచివాలయాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆ సచివాలయ పరిధిలోని వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై, పథకాలపై, పౌరసేవలపై అవగాహన కల్పించి ఏదైనా పథకానికి అర్హత కిలిగి ఉంటే వారి వద్ద నుంచి తప్పనిసరి అవసరమైన ధ్రువపత్రాలను పొందాలని అన్నారు. అలాగే అవసరమైన పౌరసేవలను అందించడానికి సంబంధిత సచివాలయంలో ఎప్పటికప్పుడు టోకెన్ జనరేట్ చేయాల్సి ఉంటుందని ఆ టోకెన్ మేరకు లబ్ధిదారులకు జూలై 1 నుండి జరిగే జగనన్న సురక్ష సమావేశాలలో సమయం సూచించి అర్హత గల పత్రాలను అందించాల్సి ఉంటుందని అన్నారు. స్పందన కార్యక్రమంలో గానీ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గాని వినతులు అందించి ఉంటే పరిష్కరించిన వాటిని వివరించడం, పరిష్కరించలేని వాటిని ఎందుకు పరిష్కరించలేక పోయామో మీ సచివాలయ పరిధిలో ఉంటే స్నేహపూర్వకంగా అర్థమయ్యేలా లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సేకరించిన వినతుల్లో అర్హత కలిగిన వారికి పౌర సేవలు, ధృవపత్రాలు అందించడానికి ఏడు రోజుల సమయం ఉంటుందని, ఏడవ రోజు జూలై 1 నుంచి 30 వరకు నిర్వహించే క్యాంపులో ప్రజా ప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు అందించాలని జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించే ధ్రువపత్రాలు పౌర సేవలు పూర్తి ఉచితం అని అన్నారు. ప్రతి మండలంలో నెల రోజుల పాటు 2 టీమ్‌ల ఏర్పాటుతో పరిష్కారం చూపడానికి ఎంపిడిఓ, డిప్యూటీ తహశీల్దార్ ఒక టీమ్, మరొక టీమ్‌లో తహశీల్దార్, ఈవోపిఆర్డి ఉంటారని అన్నారు. తిరుపతి, నగరిలో తిరుపతి ఆర్డీవో కనకనరసా రెడ్డి, సివిల్ సప్లై డిఎం సుమతి, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి గీతారాణి, చంద్రగిరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రోటోకాల్ భాస్కర్ నాయుడు, జిల్లా పంచాయితీ అధికారి రాజశేఖర్ రెడ్డి, డిఎల్‌పిఓ రూపారాణి, శ్రీకాళహస్తి ఆర్డిఓ రామారావు, డిఆర్‌డిఏపిడి జ్యోతి, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి, సత్యవేడు జిల్లా ఎస్సి వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డిఓ చంద్రముని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, హార్టికల్చర్ అధికారి దశరధరామిరెడ్డి, గూడూరు, వెంకటగిరి ఆర్డిఓ కిరణ్ కుమార్, డిఎల్‌పిఓ వెంకటరామన్, డిఎల్‌డిఓ వాణిలను నియమించినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యల పరిష్కారం జిల్లా కోఆర్డినేటర్ , సచివాలయాలు జగదీష్, ఎపి ఆన్‌లైన్ కోఆర్డినేటర్ వెంకటేష్, టిసి ఎస్ రిసోర్స్ పర్సన్ భవాని శంకర్‌లను నియమించామని సచివాలయ పరిధిలో తలెత్తే సమస్యల పరిష్కరించనున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం వారు సమస్యలను తెలిపి, సర్వేలో అడిగిన సమాధానాలు అందించి అర్హత కలిగిన పథకాలకు సమాచారం అందించి లబ్ధి పొందాలని అలాగే వాలంటీర్ అందించే ప్రభుత్వ పాకెట్ క్యాలెండర్ తీసుకోవాలని విజయవంతం చేయాలని కోరారు. డిఎల్‌డిఓ సుశీలా దేవి, జిల్లా అధికారులు, విధులు కేటాయించిన అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పాటుపడని వైసీపీ ప్రభుత్వం

## రైతుల అభ్యున్నతికి...

-టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న నారా లోకేష్, నాయకులు

బాలాయపల్లి, జూన్ 23 ప్రభాత వార్త: రైతుల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పాటుపడడంలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. బాలాయపల్లి మండలం సిద్ధాగుంట గ్రామం నుండి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. నిడిగల్లు, గాజులపల్లి, పిగిలాం ఎస్టీ కాలనీ, హస్తకావేరి, జయంపు గ్రామాల మీదుగా ఆయన పాదయాత్ర సాగింది. అడుగడుగునా గ్రామస్తులు నీరాజ నాలు పలుకుతూ స్వాగతించారు. పూలు చల్లుతూ హారతు లు పట్టారు. జయంపు గ్రామంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీపై పనిముట్లు, ట్రాక్టర్లు ఇచ్చామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ ంలో వాటికి మంగళం పాడినట్లు విమర్శిం చారు. రైతు లకు గిట్టుబాటు ధరలు కూడా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కరెంటు సరఫరా సక్రమ ంగా లేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుంటూ ఆయన పాద యాత్రలను కొనసాగించారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ మస్తాన్‌యాదవ్, రామచంద్ర నాయుడు, రాయి మస్తాన్‌నాయుడు, సీసీ నాయుడు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కాలినడక మార్గాల్లో భక్తుల భద్రతపై దృష్టి

-చిరుతను బంధించేందుకు 150 ప్రాంతాల్లో సిసి కెమరాలు,బోన్లు



తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు అలిపిరి నడకమార్గంలో 7వ మైలువద్ద అటవీప్రాంతాన్ని ఆనుకునే ఉన్న చోట చిరుతపులి రాత్రి మూడేళ్ళ బాలుడు కౌశిక్‌ను నోట కరుచుకుని ఎత్తుకెళ్ళడం, స్థానికులు, పోలీసులు రాళ్ళ దాడితో అదృష్టవ శాత్తు బాలుడ్ని గాయపరచిన సంఘటనలపై టిటిడి తీవ్రస్థాయిలో స్పందించింది. అటవీప్రాంతంలో ఉన్న కాలినడక మార్గాల్లో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కాలినడక మార్గంలో అటవీప్రాంతంలో తనిఖీ చేసిన టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి అధికారుల బృందం చిరుతను బంధించేందుకు నాలుగుప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేసింది. చిరుతపులి సంచారాన్ని గుర్తించేందుకు వీలుగా 150 ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుచేశారు. అలిపిరి గాలిగోపురం నుంచి నరసింహా స్వామి ఆలయం వరకు 300మంది భక్తులు గుంపుగా అనుమతించేలా ప్రణాళికలు సిద్ధం చేసి అమలుచేస్తున్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించే దిశగా వేసిన అడుగుల్లో భద్రత సిబ్బంది నిరంతరం పహారాకాసేలా ఏర్పాట్లు చేశారు. ఈ చర్యలపై స్వయంగా టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దృష్టిసారించి పర్యవేక్షిస్తున్నారు. శేషాచలంఅటవీప్రాంతాన్ని ఆనుకునే అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాలు ఉన్నాయి. ఒక మొదటి,రెండవ ఘాట్‌రోడ్లు చాలావరకు అటవీప్రాంతంలోనే ముడిపడిఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ ఘాట్‌రోడ్లపై వెళ్ళే ద్విచక్రవాహనదారులను వెంబడించి దాడిచేసి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి. రెండేళ్ళ క్రిందట రెండోఘాట్‌లో చివరిమలుపు వద్ద తిరుమలకు చెందిన ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెంబడించి దాడిచేసిన ఘటన గుర్తుఉంది. అలాగే శ్రీవారిమెట్టుమార్గంలో ఏకంగా బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. మొదటిఘాట్‌లో మోకాళ్ళపర్వతం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారిలో వస్తున్న భక్తులపై గత ఏడాది దాడికి ప్రయత్నించి వాహనాల రాకతో పరుగులుతీసింది. తాజాగా 7వమైలు వద్ద చిరుతపులి బాలుడ్ని నోటకరచుకుని తీసుకెళ్ళి ,గాయపరిచింది. ఈ సంఘటనతో తిరుమలకు వచ్చే భక్తులకు మరింత భద్రత కల్పించేదిశగా చర్యలు మొదలుపెట్టారు. టిటిడి అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. శ్రీవారిమెట్టు మార్గంలో సాయంత్రం 6గంటల వరకు, అలిపిరి నడకమార్గంలో రాత్రి 10గంటల వరకు భక్తులను అనుమతినిస్తారని తెలిపారు.

# చుక్కల భూమికి హక్కు పత్రాలు పంపిణీ

చిల్లకూరు, జూన్ 23 ప్రభాతవార్త : చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన భూ హక్కు - భూ రక్ష కార్యాక్రమ ంలో భాగంగా ఎంతో కాలం నుంచి రికార్డులో చుక్కల భూములు సమస్యతో వున్న రైతులకు శాశ్వత పరిష్కార క్రమబద్దీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్, ఎమ్మెల్సీ మేరిగ మురళితో పాటు ఆర్డీవో కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం వారిరువురు మాట్లాడుతూ గూడురు నియోజకవర్గం లోని గూడూరు, రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలంలో చుక్కల భూమి సమస్యతో బాధపడుతున్న వారికి జగన్‌మోహన్ రెడ్డి చొరవతో గూడూరు మండలంలో 728 మంది రైతులకు చిల్లకూరు మండలంలో 633 మంది రైతులకు, కోట మండలంలో 170 మంది రైతులకు, వాకాడు మండలంలోని 292 మంది రైతులకు, చిట్టమూరు మండలంలో 24 మంది రైతులకు 3,703 ఎకరాల 44 సెంట్ల చుక్కల భూమి నుండి మార్చడం జరిగిందని ఇప్పటి నుంచి కొనుగోలు, అమ్మకాలు చేసుకోవచ్చు అన్నారు. బ్యాంకుల్లో కూడా రుణం పొందే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. రైతుల ఇబ్బందులు తెలుసుకుని ఎప్పటి నుంచో భూసమస్యతో బాధపడుతున్న వారికి భూ హక్కు కల్పించారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయనటు వంటి విధంగా జగన్‌మోహన్ రెడ్డి రైతులకు చేయడం చాలా సంతోషదాయకం అన్నారు. అనంతరం భూ హక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ కుమార్, గూడూరు ఎఎంసి ఛైర్మన్ ఓడూరు విమలమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పొనక దేవసేనమ్మ, కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరు, చిల్లకూరు మండలాల జడ్పిటిసిలు, ఎంపిటిసిలతో పాటు చిల్లకూరు ఎంపిపి వెంకటరమణమ్మ, నాయకులు అనంరెడ్డి పరందామ రెడ్డి, భక్తవత్సల రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కోడూరు మీరారెడ్డి, ఐదు మండలాల తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏకాభిప్రాయంతో కలుసుకున్నాం

## వేదనతో విడిపోయాం...

-పార్టీ విజయమే లక్ష్యం..బాబును సిఎం చేయడమే ధ్యేయం -ఎస్సీవీని పార్టీలోకి ఆహ్వానించిన సుధీర్‌రెడ్డి



ఎస్సీవిని పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

తొట్టంబేడు, జూన్ 23 ప్రభాతవార్త : వేదనతో విడిపోయాం.. ఏకాభిప్రాయంతో కలుసుకున్నామని.. తిరిగి మళ్ళీ ఏకమయ్యామని తనను తెలుగుదేశం పార్టీలోకి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆహ్వానించడం తన సొంతగూటికి చేరడం ఎంతో సంతోషంగా ఉందని మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. శుక్రవారం తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి మాజీ ఎంఎల్‌ఏ నివాసానికి వెళ్ళి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎస్సీ వీనాయుడు నివాసంలోసందడి చోటుచేసుకుంది. అనంతరం ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ 1982లో జిల్లా కన్వీనర్‌గా ఉన్న వీరరాఘవనాయుడు తండ్రి వెంకట కృష్ణమ నాయుడు తండ్రి బలరామిరెడ్డిని ఓడించిన ఘనత సుబ్బ రామిరెడ్డిదే అన్నారు. తనతో ఎప్పుడు రచ్చచేసే నాయకుడు దివంగత నేత పిఆర్.మోహన్ కూడా తనను ఊరందూరుకు చెందిన వాడినేనని చెప్పే వారన్నారు. నేడు దిగజారుడు రాజకీయంగా మారిందని, మాటలు నీచమైతే ఆస్తులకోసం అర్రులు చారుస్తూ పరుగెత్తుతున్నారన్నాని పేర్కొన్నారు. దిగ్రేట్ లీడర్, కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య మాటాలు గుర్తు చేశారు. ‘ఆశయం ఉన్న వాడికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని- ఆశగల వాడికి అధికారం ఇస్తే దోచుకుని తింటారని’ వివరించారు. తాను మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వద్దకు వెళ్తే రాష్ట్ర పరిస్థితులు చెప్పారని ఏవిధంగా అయినా సరే రాష్ట్రాన్ని దోచుకుం టున్న వైకాపా ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆసారి అధికారంలోకి వచ్చిందంటే ఆస్తులనే కాదు..ఆడవాళ్ళని కూడా వదలరని ఆవేదన వ్యక్తం చేశారని గౌరవంగా చంద్రబాబునాయుడును అసెంబ్లీకి పంపేందుకు అందరు సమిష్టికృషితో పనిచేసి తెలుగుదేశంపార్టీని గెలిపించాల న్నారు. తనకు టిక్కెట్టుపై ఆశలేదని, పార్టీకోసం కష్టపడడం ఒక్కటే అని ఇక్కడ సుధీర్‌రెడ్డిని గెలిపిస్తామ న్నారు. తాను వైసిపిలోకి వెళ్ళి అనుభవించానని ఇందులో తనకు ఒకశాతం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు గెలుపుకోసం, శ్రీకాళహస్తిలో టిడిపి అభ్యర్థికోసం కష్టపడి పనిచేస్తాన న్నారు. చంద్రబాబు టిక్కెట్టు ఇచ్చిన వారిని గెలిపించ డమే తన ధ్యేయం అన్నారు. గతంలో ప్రస్తుత ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి, సతీమణి, కుమార్తె తమ వద్దకు వచ్చి నమస్కరించి గ్రూపులు పెట్టవద్దని తెలిపారన్నారు. తర్వాత నాయుడుపేటకు చెందిన గిరిరెడ్డి కూడా తన వద్దకు వచ్చి గ్రూపులు పెట్టవద్దన్నారు. తాను ఎన్నడూ గ్రూపు రాజకీయాలు చేయలేద న్నారు. తమ టిడిపి కుటుంబంలో రచ్చవచ్చిందని.. తిరిగి మళ్ళీ కలుసు కున్నామన్నాని సంతోషం వ్యక్తం చేశారు. సుముర్తం చూసుకుని చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరుతానన్నారు. తనను నమ్ముకుని వచ్చిన వారికి సగౌరవం ఉంటుందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీవీనాయుడు చేరికలో మాజీ సిఎం సత్రవాడ మునిరామయ్య కీలకపాత్ర పోషించార న్నారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు విజయకుమార్, ఎస్సీవీదిలీప్, మాజీ స్కిట్ ఛైర్మన్ గురుదశరథన్, రాష్ట్ర తెదేపా కార్యదర్శులు గాలిచలపతినాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, దశరధాచారి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళ మునిరాజనాయుడు,నియోజకవర్గ పరిశీలకులు మలిశెట్టివెంకటేశ్వర్లు, మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ నారాయణ యాదవ్, గోగినేని భాస్కర్‌నాయుడు, తొట్టంబేడు మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు, తెదేపా నాయకులు ఉమేష్‌రావు, బుజ్జి, ఖాదర్‌బాషా, అస్మత్, భాస్కర్‌నాయుడు, బిసిసెల్ అధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి, ప్రకాష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, హరి, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ఉద్యాన మిషన్ అధికారులచే పంటల పరిశీలన

కుప్పంరూరల్, జూన్ 23 ప్రభాతవార్త :



న్యూఢిల్లీకి చెందిన కేంద్ర సమగ్ర ఉద్యాన మిషన్ అధికారులు నేహాకుమారి, మ గ్రిపల్లి శివ శుక్రవారం కుప్పం మండలంలో విస్తృతంగా పర్యటించి పంటలు పరిశీలించారు. బంగానత్తం వద్ద గల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో జరుగుతున్న వివిధ రకాల కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని చందం, దాసేగానూరు గ్రామాల్లో వారు పర్యటించారు. డ్రాగన్ ఫ్రూట్, చామంతి, బంతిపూలు తదితర తోటలు, నీటి కుంటలు, పాలిహౌస్‌లను పరిశీలించారు. ఎఫ్‌పిఒలో ఉన్న రైతులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి, ఎడి కోటేశ్వరరావు, ఉద్యానవన అధికారిణి డింపుప్రియశ్రీ, అనిత, విహెచ్‌ఎ ఆదిలక్ష్మి, చంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

## జిఓనెం 110 అమలు చేయాలని రిజిస్ట్రార్‌కు మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలు

కుప్పం, జూన్ 23 ప్రభాతవార్త :

ద్రవిడ వర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్లకు సంబంధించి జిఓ నెం 110 అమలు చేయాలని రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డిని రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం అకడమిక్ కన్సల్టెంట్లు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. పలు విశ్వవిద్యాలయాల్లో జిఓ 110 అమలవుతోందన్నారు. తద్వారా 35-57వేల దాకా వేతనాలు అందుతున్నాయని ద్రవిడ వర్సిటీలో జిఓ అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి జిఓ 110ను అమలు చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించినట్లు అకడమిక్ కన్సల్టెంట్లు తెలిపారు.

## జగనన్న సురక్ష విజయవంతంకు చర్యలు

– కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:

తహసిల్దార్లు, ఎంపిడిఓలు సమన్వయం చేసుకొని జగనన్న సురక్ష కార్యక్రమంను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై డిఎల్‌డిఓ, జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంను జిల్లాలో ఎలాంటి తప్పులు లేకుండా విజయవంతం చేయాలన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు ఎంపిడిఓలు, తహసిల్దార్లు వాలంటీర్లతో కలిసి కొన్ని ఇళ్ళకు వెళ్ళి వాలంటీర్ల యాప్ ద్వారా ఆప్‌లోడ్ చేసే సమయంలో ఏదైనా ఇబ్బందులు వుంటే వెంటనే సరి చేయాలని తహసిల్దార్లు, ఎంపిడిఓలను ఆదేశించారు. వాలంటీర్లు శని, ఆది, సోమవారాల్లో వారి పరిధిలోని 50 కుటుంబాలను సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కుటుంబాలకు ఏ సర్టిఫికేట్లు అవసరమో, వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొని సోమవారం మధ్యాహ్నం సమయానికి డిజిటల్ అసిస్టెంట్లకు అందించాలన్నారు. సోమవారం మధ్యాహ్నం నుండి మంగళవారం సాయంత్రానికల్లా డిజిటల్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్ చేసి టోకెన్లను సంబంధిత కుటుంబాలకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుడిపాల మండలం నుండి జెసి శ్రీనివాసులు, కలెక్టరేట్ నుండి డ్వామా పిడి గంగాభవానీ, డిపిఓ లక్ష్మి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం ఎస్‌ఐగా రామ్‌భూపాల్

బంగారుపాళ్యం, జూన్ 23 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా ఎం.రామ్‌భూపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వి.కోట పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై బంగారుపాళ్యంకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునరెడ్డి అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్ళారు.

## బాల్య కార్మికులను నిషేధించాలి

బంగారుపాళ్యం, జూన్ 23 ప్రభాతవార్త:

బాల కార్మికుల నిర్మూలన చట్టంపై పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా లేబర్ ఆఫీసర్ హేమాచ్చారి మాట్లాడుతూ 14 సంవత్సరాల్లోపు పిల్లలను ఎవరు పనుల్లో వుంచుకోరాదని చెప్పారు. పిల్లల చేత పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కో-ఆర్డినేటర్ ప్రతిభ మాట్లాడుటూ బాల్య వివాహాలు సైతం చట్టరీత్యా నేరమన్నారు. వరకట్నం, మహిళలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు తదితర అంశాలపై మహిళా పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజరావు, ఇతర పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాభారతం ప్రారంభం

సదుం,జూన్23 ప్రభాతవార్త :



మండల పరిదిలోని భట్టువారిపల్లె వద్ద ఉన్న పాండవుల ఆలయం వద్ద శుక్రవారం నుంచి మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహాయ సహకారాలతో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం ఆలయం వద్ద మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డిల చేత పూజలు చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచిలు వెంకటరమణ,హనుమంతురెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, సీహెచ్‌సీ చైర్మెన్ కృష్ణారెడ్డి, కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి మల్‌రెడ్డి, ఉపసర్పంచిలు బాబురెడ్డి, నాగభూషణరెడ్డి, వైకాపా నాయకులు చిన్నరమణ, రామాంజులు, మోహన్‌రెడ్డి, హెల్త్ భాస్కరరెడ్డి, టీచర్‌సూరి, రామయ్య, మునిరత్నం, గణేష్‌రెడ్డి,ఈశ్వరరెడ్డి, జ్యోతిరెడ్డి,ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల పరిదిలోని జోగివారిపల్లె పంచాయతీలో సుండుపల్లె ఎల్లమ్మ తిరునాల అతి వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద బోనాలు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## దళిత మహిళా సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం.



పెద్దపంజాణి జూన్23 ప్రభాతవార్త :

కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం దళిత మహిళ మాజీ సర్పంచ్ మహదేవి మీద కులం పేరుతో దూషించి,ఎన్కౌంటర్ చేసి చంపుతా అన్న రామకుప్పం ఎస్సై కృష్ణయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని మాలమహానాడు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కెళవాతి సుబ్రమణ్యం డిమాండ్ చేసారు. దళిత మహిళ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన రామకుప్పం ఎస్సై క్రిష్ణయ్యపై ఉన్నతాధికారులు ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

## జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు మేలు : జెడ్పీటీసీ

పెద్దపంజాణి, జూన్23 ప్రభాతవార్త :




జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మాకీర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్స వంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శమని తెలిపారు.జగనన్న సురక్ష పథకాన్ని వాలంటీర్లు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్ విశ్వనాధ్,డిప్యూటి తహశీల్దార్ ఏ.ఫనికుమార్,సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డివారి ఓబుల్‌రెడ్డి (బాబు),మండల కన్వీనర్ బాగారెడ్డి,వైస్ ఎంపిపి జి.డి.బాబు,మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జూలై 1న కాణిపాకం పాలకమండలి సమావేశం

కాణిపాకం, మే 23 ప్రభాతవార్త

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి సమావేశం జూలై 1న జరుగుతుందని ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ఈమేరకు స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే పాలకమండలి సమావేశంకు సభ్యులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

## అంగన్‌వాడీ పోస్టులకు భర్తీకి ఇంటర్వ్యూలు

కుప్పంరూరల్, జూన్ 23 ప్రభాతవార్త :

కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, రెండు మినీ కార్యకర్తలు, తొమ్మిది హెల్పర్ పోస్టుల భర్తీకి శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. ఈసందర్భంగా సిడిపిఒ అరుణశ్రీ మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు అంగన్‌వాడీ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించామన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బోయకొండ ధర్మకర్తల మండలిలో శెట్టి పవన్‌కు చోటు...?

-విధేయత కార్యదీక్షకు పట్టం



చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త :

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలిలో చౌడేపల్లికి చెందిన శెట్టి పవన్‌కుమార్‌కు చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధిస్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదే జరిగితే ఆయన విధేయతకు పట్టం కట్టినట్లుగా స్థానిక నాయకత్వం భావిస్తోంది. శెట్టి పవన్‌కుమార్ ఆదినుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విధేయుడుగా వున్నాడు. ఈమేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యుల ఆశీస్సులు లభించాయనీ, ఎన్నికనేది లాంఛనం మాత్రమేనని పార్టీ వర్గాలు తెలిపాయి.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి, జూన్ 23 ప్రభాతవార్త :



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో కలిశారు. విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యల్లో భాగంగానే మండలానికి ఇద్దరు ఎంఇఓలను నియమించారనీ, ఆదిశగా అందరం ప్రభుత్వ లక్ష్యాన్ని అదిగమించాలని అధికారులకు సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన ఎంఇఓ-2 తిరుమలమ్మ, ఎంఇఓ కేశవరెడ్డి, హరినాథ్, ఉపాధ్యాయులు మంత్రి పెద్దింరెడ్డిని పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సత్కారం




చౌడేపల్లి, జూన్ 23 ప్రభాతవార్త :

బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్ళిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండలంలోని మేకలచిన్నేపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శివరాత్రి వీరభద్రయ్య, శ్రీనివాసులు, దామోధరంలు బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్ళారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు వారిని సత్కరించారు.

## నవోదయ పాఠశాలకు ఎంపిక



సదుం,జూన్23 ప్రభాతవార్త :

మండల పరిదిలోని నడిగడ్డ పంచాయతీకి చెందిన తలారి తమన్‌తేజ్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతికి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. ఆవిద్యార్థి తాటిగుంటపాలెం పంచాయతీ చింతలవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నాడు. అతని తండ్రి కిషోర‌్ కుమార్ అదేపాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. నవోదయ పాఠశాలకు సదుం మండలంనుంచి ఎంపికైన విద్యార్థిని పలువురు అభినందించారు.

## తమిళ సినీ హీరో విజయ్ జన్మదిన వేడుకలు

చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:

తమిళ సినీ నటుడు దళపతి విజయ్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు విజయ్ ఫ్యాన్స్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు విజయ్ అభిమానుల సొసైటీ అధ్యక్షుడు పురుషోత్తం, శరత్, బాబు, మనోజ్, అర్జున్, దిలీప్, రాజేష్, ధనుష్, జ్ఞాన. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయండి

– చైర్‌పర్సన్ నక్క భానుప్రియ

వెంకటగిరి, జూన్ 23 ప్రభాతవార్త:

సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం వీడియో కాన్ఫిరెన్సు చైర్‌పర్సన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంకు సమస్యలు చెప్పేందుకు వచ్చిన వారికి సీఎం చెప్పిన విధంగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమస్యలు కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కమిషనర్ వెంకటరామయ్య, డిప్యూటీ తహసీల్దారు రాంబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

సూళ్లూరుపేట, జూన్ 23 ప్రభాతవార్త :




విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తిరుపతి జిల్లా ఏబీవీపీ కోకన్వీనర్ సన్నీ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు అడ్డగోలుగా దోచుకుంటున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు కనీస సౌకర్యాలు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పుస్తకాలకే 11 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు భారం మోపుతున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులకు ఈ విషయాలు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యల పట్ల స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నగర కార్యదర్శి శ్రీమంత్, వెంకటేష్, లోకేష్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల అభ్యున్నతికి చర్యలు

కోట, జూన్ 23 ప్రభాతవార్త :



ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు నాణ్యత ప్రమాణాలతో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన జాతీయ సభ్యుడు మురళీ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ భవానితో కలిసి ఆయన మాట్లాడారు. 50 శాతానికి పైబడి షెడ్యూల్డు గ్రామాల్లో ఎస్సీ కులాలు ఉన్న గ్రామాలను ఎంపిక చేసి కేంద్రప్రభుత్వ ఆర్థిక సహాయంతో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలో చేపట్టిన పనుల వివరాలు సేకరించినట్లు తెలిపారు.

## 25 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

కోట, జూన్ 23 ప్రభాతవార్త :

కోట మండలం కేశవరం గ్రామానికి చెందిన రామయ్య అనే వ్యక్తి శుక్రవారం 25 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని తీసుకెళు తుండగా పట్టుకున్నట్లు వాకాడు సెబ్ సిఐ లక్ష్మిప్రసన్న తెలిపారు. చిట్టేడు బ్రాందీషాపులో రామయ్య 25 బాటిళ్లను కొనుగోలు చేసి ఆటో కోసం వేచి ఉండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ తెలిపారు. ఆ మేరకు 25 బాటిళ్లతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## కేశవరం ఆర్‌బికె తనిఖీ

కోట, జూన్ 23 ప్రభాతవార్త :

కోట మండలం కేశవరం సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఆర్‌బికె పరిధిలో రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈకేవైసీ ఎంత మేరకు నమోదైందని సమాచారం తెలుసుకున్నారు. ఆయన వెంట ఎడి ధనంజయరెడ్డి, నాయుడుపేట ఎడి ఉమా, కోట వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## చల్లని కబురు

కోట, జూన్ 23 ప్రభాతవార్త :

ఎండల తీవ్రత ఉక్కుపోతతో అల్లాడుతున్న ప్రజలతో పాటు వానాకాలం సాగుకు సర్వం సన్నద్ధమైనా వానల జాడ లేక దిగాలుగా ఉన్న కర్షకులకు ఎట్టకేలకు చల్లని కబురు అందింది. జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. రెండు మూడు రోజుల్లో రుతు పవనాలు మరిన్ని భాగాలకు విస్తరించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రుతు పవనాలు ప్రవేశించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పశ్చిమమధ్య బంగాళాఖాతంలో పరిసరాల్లోని ఉత్తరాంధ్ర- దక్షిన ఒడిస్సా తీరాలకు సమీపంలో సముద్రమట్టం నుంచి 3.1 కిలోమీటర్లు నుంచి 5.8 కిలోమీటర్ల వరకు ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో వర్షాలు కురవనుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## త్వర పడితేనే పిఎం కిసాన్ సాయం

కోట, జూన్ 23 ప్రభాతవార్త :

రైతులకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 14వ విడత జమ కావాలంటే లబ్ధిదారులంతా తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే పలుమార్లు కేంద్రప్రభుత్వం చెప్పినా చాలామంది రైతులు ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ రైతుల ఖాతాకు సొమ్ము జమ చేశారు. జూలై నెలలో జమ చేసే పిఎం కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము పొందాలంటే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించింది. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి వెంటనే చేసుకోవాలని చెప్తున్నారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ కేశవరం ఆర్‌బికెలో రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నగదును కేంద్రప్రభుత్వం రైతుల ఖాతాలో ఏడాదికి రూ.6 వేలు జమ చేస్తుందని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడికి రూ.2 వేలు చొప్పున ఏడాదిలో మూడు విడతలు అందజేస్తుందని చెప్పారు. రైతులు, భూములు అమ్ముకున్న వారు, కొనుగోలు చేసిన వారు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్లు లేని వారు చాలామంది ముందుకు రావడం లేదు. జూన్ 30వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని నిరంజన్‌కుమార్ కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో గాని, మీసేవ, ఈసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ నంబర్‌కు అనుసంధానమైన ఫోన్‌నంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా ఈకేవైసీ సులభంగా చేసుకోవచ్చని సూచించారు. బయోమెట్రిక్ పద్ధతి, ఓటీపీ విధానం రెండుమార్గాల ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.

## హిందీ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో మృతి!

దొరవారిసత్రం, జూన్ 23 ప్రభాతవార్త :



దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు కోగిలి జయరామయ్య (39) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. జయరామయ్య నెల్లూరుకు రూరల్ మండలం ఎంపియూపి కలివెలపాలెం ప్రాథమిక పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలు ఉపాధ్యాయ సంఘాలు, మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య తదితరులు ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాలు రూ.36,100 ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరితో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల వారు ఉన్నారు.

## ఈకేవైసి తప్పనిసరిగా లబ్ధిదారులు చేసుకోవాలి

వాకాడు, జూన్ 23, ప్రభాతవార్త :



పీఎం కిసాన్ పథకంలో 14వ విడత లబ్ధిదారులుంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం వాకాడులోని ఆయన మాట్లాడుతూ మండలంలోని బాలిరెడ్డిపాలెం, కోడివాక, మొలగనూరు ఈకేవైసీని పర్యవేక్షించారు. మండలం లోని పీఎం కిసాన్ ప్రతి ఒక్కరూ ఈ కేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. ఆధార్ అనుసంధాన ఓటిపి రానివారికి ఒక ఆధారిత గుర్తింపు ద్వారా పీకేవైసీని పూర్తి చేయవచ్చునని వివరించారు. ఆయన వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు ఎరువుల విభాగం ధనుంజయ రెడ్డి, నాయుడుపేట వ్యవసాయ సంచాలకులు డి. ఉమా, వాకాడు వ్యవసాయ అధికారిని దీప, రైతు భరోసా వ్యవసాయ సహాయకులు లక్ష్మయ్య, హర్షవర్ధన్, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

## అనీమియా లెవల్స్‌పై క్షేత్ర స్థాయి అవగాహన

కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త:

క్షేత్రస్థాయిలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అనీమియా లెవల్స్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ మెడికల్ ఆఫీసర్లతో ఎన్‌సిడిసిడి సర్వే, 0-5 సంవత్సరాల పిల్లల జనన ధృవీకరణ పత్రాల మంజూరు, ఆధార్ నమోదుపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలందరికీ జనన ధృవీకరణ పత్రాలు ఇచ్చే సమయంలోనే పిల్లల పేరుతో పొందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సిడిపిఓలు కృషి చేయాలన్నారు. అలాగే జనన ధృవీకరణ పత్రాల మంజూరుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పని చేసి జనన ధృవీకరణ పత్రాలు పొందిన అనంతరం ఆ పిల్లలందరికీ ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభించడానికి వీలవుతుందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి గర్భవతులు, బాలింతలు, కౌమార దశ బాలికల్లో అనీమియా నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీనితో పాటు ఐసిడిఎస్ శాఖకు సంబంధించి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ అంశాలకు సంబంధించి అవగాహన కల్పించడానికి మెదట సిడిపిఓలకు శిక్షణ ఇప్పించి అనంతరం సెక్టార్ సమావేశాల్లో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బైకును ఢీకొన్న బొలేరో వ్యాను...యువకుడు మృతి

చిల్లకూరు, జూన్ 23, ప్రభాతవార్త :



చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పై శుక్రవారం వెనుక నుండి బొలేరో వ్యాను బైకును ఢీకొనడంతో కలకత్తా నగరానికి చెందిన బినీత్ (22) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైకులో వెనుక కూర్చొని వున్న సోమెన్‌కి తలకు తీవ్ర గాయాలు అవ్వడం జరిగింది. వీరిద్దరు కలకత్తా నగరం నుంచి మండలంలో రొయ్యల చెరువుల వద్ద పని చేస్తున్నారు. అయితే గూడూరుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

## నడకదారిలో ఔట్‌పోస్టులతో భద్రత కల్పించాలి

-ఎయిర్‌గన్స్‌తో శబ్ధాలతో వన్యప్రాణులు సంచారం కట్టడి

-శ్రీవారి భక్తుడు నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి,జూన్ 23ప్రభాతవార్త:

కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ దేశవ్యాప్తంగా వచ్చే భక్తులు తమ మొక్కుబడులు, విశ్వాసంలో భాగంగా కాలినడకన తిరుమలకు చేరుకుంటున్నారని, ఆ భక్తులకు టిటిడి పూర్తిభద్రత కల్పించాలని రాయలసీమ పోరాటసమితి కన్వీనర్ ,శ్రీవారి భక్తుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో భక్తుల కోసం పోలీస్ ,భద్రత సిబ్బంది ఔట్‌పోస్టులు ఏర్పాటుచేసి, పోలీసు, విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని సూచించారు. శబరిమల లాగా తిరుమల కొండల్లో వన్యప్రాణులు భక్తుల సంచారం, జనవాసాల్లోకి రాకుండా ఎయిర్‌గన్స్‌తో శబ్దాలు చేయాలని కోరారు. దీనివల్ల భక్తులకు వన్యమృగాల నుంచి రక్షణ కల్పించినట్లువుతుందని తెలిపారు. అంతేగాక ప్రత్యేక అనుమతులు తీసుకుని నడకమార్గాల్లో ఇరువైపులా ప్రత్యేక ఇనుపకంచె వేయాలని సూచించారు. మూడేళ్ళ కౌశిక్‌ను చిరుతపులి నోటకరుచుకుని దేవుని దయతో గాయాలతో వదలిపరారవడం వంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా గాకుండా భక్తుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు.

## అమ్మవారిని అలంకరించిన వేడ..చూడాలి...

శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఆలయంలోవెలసిన జ్ఞానప్రసూనాంబికా దేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

తవణంపల్లె, జూన్ 23 పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పుణ్యసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని ఎల్‌బి.పురం, పుణ్యసముద్రం తదితర గ్రామాలలో ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాబు తెలిపారు.



ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ శంకరయ్య, ఉపాధి ఏపీఓ లలిత, వెలుగు ఏపీఎం రవి, ఏఓ ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్దపంల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, పుణ్యసముద్రం రవిప్రసాద్, డేవిడ్, కుమార్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా వుండగా జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష అద్భుతమైన కార్యక్రమం :మంత్రి రోజా

నగరి, జూన్ 23 ప్రభాతవార్త:



జగనన్న సురక్ష ఎంతో అద్భుతమైన కార్యక్రమం అని మంత్రి రోజా అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిండ్ర మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వలంటీర్లు గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ కారణం చేత అర్హులకు ఆగకూడదు పార్టీకి, కుల మతాలకు సంబంధం లేకుండా అర్హత ఉన్న వారికి పథకాలు, కావలసిన సర్టిఫికెట్లు అందాలన్న జగనన్న ఆశయంలోంచి పుట్టిందే జగనన్న సురక్ష కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కావలసిన పత్రాలను అప్పుడే సేకరించి వాటిని సచివాలయాల్లో పొందుపరచి టోకన్లు అందజేస్తారన్నారు. వారం రోజుల తరువాత మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయాల పరిధిలో ఒక రోజు ఉండి పరిశీలించిన వివరాలను జిల్లా స్థాయికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పథకాలు అందడంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం ఏ కారణం చేత రాలేదో తెలియపరచడంతో పాటు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రం, మరణ ధృవీకరణ పత్రం, వివాహ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్ ఫోన్ నెంబరు అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు, కొత్త విభజన రైస్ కార్డు, హైస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వాటిని అక్కడే అందజేస్తారన్నారు. ఇంటి వద్దకే పరిపాలన తీసుకొచ్చి వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు ఇంటి వద్దకే పెన్షన్ లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ సాయం అంటూ ఎలాంటి అవకతవకలు లేకుండా పరిపాలన చేపడుతున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటి గురించి ఇంత శ్రద్ధ తీసుకుని పని చేసే ముఖ్యమంత్రి మరొకరు ఉండరని అలాంటి వ్యక్తి పాలనలో మనము ప్రజాప్రతినిధులుగా ఉన్నందుకు గర్వపడాలన్నారు. సమావేశంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్టేట్ డైరెక్టర్లు, సింగిల్‌విండో డైరెక్టర్లు, చైర్మన్‌లు, కో-ఆప్షన్ మెంబర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎస్‌ఎల్‌ఎన్ మెడికల్ షాపులో మత్తు సిరప్‌లను స్వాధీనం చేసకున్న ఎస్ఇబి అధికారులు

-నగరములో డ్రగ్స్ పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు -ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి

తిరుపతిరూరల్, జూన్23 ప్రభాతవార్త:



తిరుపతి నగరములో మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నగరములో పెద్దకాపు వీధిలో హరిత అనే మహిళ ఇంటివద్దనే ఎటువంటి బిల్లులు లేకుండా మత్తును కలిగించే మందులు విక్రయిస్తున్నారనే సమాచారాన్ని తెలుసుకుని, ఆమె నిర్వహించే ఎస్‌ఎల్‌ఎన్ మందులషాపులపై దాడులు నిర్వహించగా ఎటువంటి బిల్లులు లేని మత్తును కలిగించే పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌ఎల్‌ఎన్ మెడికల్ షాపులో టాసెక్స్ సిరప్-18, కాడ్జెన్ సిరప్-11, విన్‌రోప్-సి సిరప్-6, ఫోర్ట్‌విన్ ఇన్‌జెక్షన్స్-2, నెట్రోవిట్ టాబ్లెట్స్-18 దొరికినట్లు తెలిపారు. మత్తును కలిగించే ఈ మందులను ఇంటివద్ద నిల్వ ఉంచుకుని, యువతకు విక్రయిస్తున్న హరితపై కేసు నమోదు చేసి, మత్తును కలిగించే పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ పెట్టుకోకపోతే జరిమానా!

-ఫోటో గ్రాఫర్లుగా పోలీసులు
-టార్గెట్‌ల కోసం తెల్లవారక ముందే ఫోటోలు తీస్తున్న పోలీసులు
-విధులకంటే ఫోటోల పైనే అధిక సమయం కేటాయింపు

గూడూరు, జూన్ 23 ప్రభాతవార్త :

గూడూరు పట్టణంలో ద్విచక్ర వాహన దారుల పోలీసులు తీసే ఫోటోలతో బెంబేలెత్తిపోతున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడపాలంటే ఎప్పుడు ఎక్కడ ఎలా ఫోటో తీస్తారో భయంతో వణుకుతున్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కు, విధులకు, ఇతరత్రా పనులకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తెల్లవారు జామున కూడా వెళ్లాలంటే ఫోటోలు తీయడంపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కుటుంబంతో షాపింగ్‌కు వెళ్లాలనుకున్నా, కాలక్షేపానికి పిల్లా పాపలతో పార్కుకో సినిమాకో వెళ్లాకోసమైనా, పక్కింటికి వెళ్లాలంటే పిల్లాడిలా చంకన హెల్మెట్ ఉండాలని సోషల్ మీడియాలో సిటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. పట్టణంలో దుకాణాల ముందు వాహనాలు తీసేముందు, పార్క్ చేసి ముందు హెల్మెట్ పెట్టుకోవడానికి ఆలస్యం అయినా జరిమానా కడుతున్నారు. ప్రస్తుత కాలంలో ఒక వ్యక్తి బజారుకు రావాలంటే మాస్కు, హెల్మెట్, ఫోన్ ఇబ్బందులు పడాల్సిందేనని కొందరి అనుభవజ్ఞుల అభిప్రాయ పడుతున్నారు.

**- హెల్మెట్‌తో లాభమే..**

వాహనాలు నడిపే క్రమంలో కార్లకు సీట్ బెల్ట్, బైక్ పై వెళ్లే హెల్మెట్ ధరిస్తే వాహనాదారులకు అన్ని రకాలుగా రక్షణ కవచంగా ఉంటుందని పోలీసు శాఖ అవసరమైన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకుంటున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హద్దులు దాటిన వారిపై అపరాధ రుసుం విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలు నియమ నిబంధనలతో నడుచుకుంటే, లా అండ్ ఆర్డర్‌తో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్తున్నారు. ఈ మధ్య గత కొన్ని సంవత్సరాలుగా హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదంలో చనిపోయిన వారే అత్యధిక శాతమని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సీట్, బెల్ట్, హెల్మెట్ స్వీయ రక్షణ కోసమని, సమిష్టి కృషితో ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్యను పూర్తి స్థాయిలో తగ్గే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

- వంద పోటీలు కొట్టాల్సిందే..

గూడూరు నియోజకవర్గం దినదినాభివృద్ధి చెందడంతో ట్రాఫిక్ సమస్య కూడా అదే స్థాయిలో తాండవం చేస్తుంది. ట్రాఫిక్ నియమాల్లో భాగంగా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు సరైన పత్రాలు లేని కార్లకు ద్విచక్ర వాహనాలకు పైన్లు వేసే ప్రక్రియ గూడూరు పట్టణంలోని ఘాటుగానే కొనసాగుతుంది. ఈ క్రమంలో హెల్మెట్ లేదా ఇతరత్రా పత్రాలు లేని వాహనాలను ఫోటోలు తీసే ప్రక్రియ కానిస్టేబులకు, హోంగార్డులకు అప్పజెప్పారు. డ్యూటీ ఎక్కిందే తడువు ఫోటీలు తీయడం మొదలు పెడుతున్నారు. టార్గెట్ పూర్తి కోసం గంటల తరబడి ఫోటోలు తీసినా ఒక్కోసారి టార్గెట్ పూర్తికాకుండా మొబైల్ హీట్ కావడంతో ఆగిపోవడం లేదా చెడిపోవడం జరుగుతుందని కొందరు. పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రన్నింగ్ వందల కొద్ది పోటోలు తీసినా సగం కూడా పూర్తి స్థాయిలో పనికి రావడం లేదని కొన్ని సందర్భాల్లో గొడవలు ఎదురుకోవాల్సి వస్తుందని మాటలు పడాల్సి వస్తుందని వాహన దారులు వాపోతున్నారు. హెల్మెట్ సుధూర ప్రయాణాలకు అయితే హెల్మెట్ వాడడం బాగుంటుంది కానీ పట్టణంలో గుంతల రోడ్లు ఇరుకు ప్రదేశాలు నిత్య ట్రాఫిక్ మధ్య హెల్మెట్ వాడాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనాలకు పత్రాలు లేకుంటే ఫైన్ వేస్తే పద్ధతిగా ఉంటుందని హెల్మెట్‌లో తలనొప్పులు, మెడ నొప్పులు వస్తున్నాయని మరి కొందరు సమస్య వాధిస్తున్నారు. మొత్తానికి హెల్మెట్ నిజమైన తలనొప్పిగా మారుతుందని కొందరు పట్టణ వాసులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా హెల్మెట్ సీట్ బెల్ట్ వాడడం సురక్షితమని పోలీసులు అనుభవజ్ఞులు చెబుతున్నారు.

## జనం బాగుండాలంటే..జగన్ పోవాలి

-జనసేన పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 23 ప్రభాతవార్త:



రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, అరాచకం ఆగాలన్నా,జనం బాగుండాలన్నా.. జగన్ పోవాలని జనసేన పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి పిలుపునిచ్చారు.నిన్నటి రోజున అమలాపురంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హలో ఏపి..బైబై వైసిపి అనేది మన ఎన్నికల నినాదమని జనసైనికులకు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక టివిఎస్ షోరూం సర్కిల్ వద్ద జనసైనికులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే. ఈసారి ఏ మచ్చా లేని పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకేపాటి సుభాషిణి, కొండా రాజమోహన్, ఆనంద్, హేమకుమార్, లక్ష్మి, చందన, దుర్గ,రాజేష్ ఆచారి,వినోద్,పార్థు,గుట్టా నాగరాజు, సాయికుమార్, గోపి, భాను, రమేష్, పురుషోత్తం, మనోజ్,సాయిదేవ్,మోహన,తదితరులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డి మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన

చంద్రగిరి, జూన్ 23 ప్రభాతవార్త:



మండల పరిధిలోని అగరాల, ఐతేపల్లి, ఏజి పల్లి, పులివర్తివారిపల్లి కొటాల, పుల్లయ్యగారి పల్లి, బందార్లపల్లి, రామిరెడ్డి పల్లి గ్రామాలలో ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ తనయుడు, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వైద్య శిబిరాలను పరిశీలించి, ప్రజలతో మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అనారోగ్యం బారినపడి ఆకస్మిక మరణాలు చోటుచేసుకోకుండా నియంత్రించడమే లక్ష్యంగా ముందస్తుగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే హర్షిత్ స్వయంగా బిపి పరీక్షించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు,తహాశీల్దార్ శిరీషా, రామిరెడ్డి పల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి చంద్రగిరి డివిజన్ అధ్య క్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాయకులు మించల ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచిపై పద్మావతిదేవి విహారం

తిరుచానూరు, జూన్ 23 ప్రభాతవార్త :



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం తిరుమాడ వీధులలో తిరుచ్చి పై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొల్పి సహస్రనామార్చన నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం నేత్ర పర్వంగా అభిషేకం, కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉద్యానవనంలో సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవ అనంతరం తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తులు కర్పూర నిరాజనాలందించారు. ఈ కార్యక్రమంలో ఎవిఎస్‌వో శైలేంద్ర బాబు, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్స్పెక్టర్లు శుభాస్కర్, గణేష్, అర్చకులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల తిరునాళ్లు ప్రారంభం

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల తిరునాళ్ళు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. ఆలయంలోని ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, శాసనసభ్యుని సతీమణి బియ్యపు వాణి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు.కలశ స్థాపనను ఆలయ అర్చకులు డాక్టర్ స్వామీనాధన్ గురుకుల్ సారధ్యంలో నిర్వహించారు. భక్తులు సమర్పించిన చీరలను అధిరోహింపజేసారు.పాండవ జననం,కౌరవ జననం కథతో అంకురార్పణ ధ్వజారోహణం నిర్వహించారు.ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు పర్యవేక్షణలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.12రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ వివరించారు. ధ్వజారోహణం తరువాత పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.ధ్వజారోహణ కార్యక్రమాల్లో ఇఓ సాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, శానిటరీ ఇన్స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి,సభ్యులు రమాప్రభ, సునీత,లక్ష్మి,చింతామణి పాండు, శ్రీదేవి తదితరులు హాజరయ్యారు.

## నూతన ఎస్పీ క్యాంపు కార్యాలయం ప్రారంభించిన మంత్రి

తిరుపతి క్రైం, జూన్ 23 ప్రభాతవార్త :



రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా తిరుపతి జిల్లాగా ఏర్పాటు చేసారు. ప్రభుత్వం వారు జిల్లా పోలీస్ కార్యాలయాలను తిరుపతి పోలీస్ పెరేడ్ మైదానం వద్ద నిర్మిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పి క్యాంపు కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఎం కె. నారాయణ స్వామి ప్రారంభించారు. అనంతరం త్రిపుర డిఐజి ఆవుల రమేష్ రెడ్డి, జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి, పోలీస్ పెరేడ్ మైదానం వద్ద పునర్నిర్మించిన సుజల వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హైసింగ్ కార్పోరేషన్ చైర్మన్ చిరంజీవి రెడ్డి, టిటిడి సివిఎస్ఓ నరసింహ కిషోర్, నగర మేయర్ డాక్టర్ శిరీష యాదవ్, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, అదనపు ఎస్పిలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, మునిరామయ్య, రాజేంద్ర, పోలీస్ హూసింగ్ బోర్డు డిఈ సుబ్బరాయుడు, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 10 కోట్లతో ఉడాయించిన చీటి వ్యాపారి

గంగవరం,జూన్ 23 ,ప్రభాతవార్త :

అమాయకులకు కుచ్చుటోపి పెట్టి కోట్లు కొళ్ళగొట్టిన కేటుగాడు రాత్రికి రాత్రే ఊరు నుండి ఉడాయించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.బాధితులు పోలీసులకు తెలిపిన వివరాలు మేరకు వివరాలిలా..మండలంలోని కీలపట్ల పంచాయతీ నలసానిపల్లె గ్రామానికి చెందిన జి.సుబ్రమణ్యం కుమారుడు జిఎస్ శంకరయ్య అనే వ్యక్తి గత కొంత కాలంగా తమ గ్రామంలో,పలమనేరు పట్టణం బజారు వీధిలో ఓ గదిలో అద్దెకు ఉంటూ చీటీలను నిర్వహించేవాడు.శంకరయ్య ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రతి నెల రూ.5 లక్షలు.రూ.10 లక్షలు, రూ.15 లక్షలు,రూ.20 లక్షలు చీటీలను నిర్వహించేవాడు.అతనికి గ్రామంలో, పలమనేరు పట్టణంలోను సొంత భవనాలు ఉండడంతో చాలా మంది అమాయకులు నమ్మకంతో అతని వద్ద చిట్టీలు వేశారు. నలసానిపల్లె, పలమనేరు, తమ్మిరెడ్డిపల్లె,గ్రామాల వారే కాక కర్ణాటక రాష్ట్రానికి



చెందిన ఎందరో తమ కూతురు పెళ్లి కోసం కొందరు, కొడుకు చదువు కోసం కొందరు, సొంతిటి నిర్మాణం కోసం మరి కొందరు ఇలా చీటీలు వేశారు.చిట్టీల గడువు పూర్తి అయినా డబ్బులు ఇవ్వకుండా నెలలు తరబడి తిప్పుకుంటూ కాలయాపన చేశాడని,చిట్టీల నిర్వాహకుడు రాత్రికి రాత్రే భార్య పిల్లలతో సహా గ్రామం నుండి ఉడాయించాడని తెలియడంతో బాధితులు లబోదిబోమంటు పోలీసులను ఆశ్రయించారు.కుటుంబ అంతా కూలీనాలీ చేసుకొని కడుపుకట్టుకొని తమ పిల్లల భవిష్యత్తు కోసం కూడబెట్టుకొని చీటీలు కట్టామని బాధితులు కన్నీళ్ల పర్యాంతమవుతున్నారు.అయితే చిట్టీల నిర్వాహకుడు శంకరయ్య రెండు నెలల క్రితమే తన ఆస్తులను బంధువుల పేరుపై రాయించినట్లు తెలిసింది.ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు దాదాపు 60 మంది బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు చిట్టీల నిర్వాహకుడు శంకరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుని త్వరలో పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

## తీరప్రాంతాల్లో బీచ్‌లను అభివృద్ధి చేస్తాం

కోట, జూన్ 23 ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్‌లోని 974 కిలోమీటర్ల పరిధిలో ఉన్న తీరప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఆర్ అనుపమ, టూరిజం ఏఇ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని శ్రీనివాససత్రం బీచ్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఆదేశాల మేరకు తీరప్రాంతాల్లోని బీచ్‌లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 974 కిలోమీటర్ల పరిధిలో ఉన్న బీచ్‌లను సందర్శిస్తున్నట్లు తెలిపారు.

## నాదస్వర కళాకారులకు సత్కారం

వాకాడు, జూన్ 23 ప్రభాతవార్త :



వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాదస్వర కళాకారులైన దంపతులకు వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి చేతుల మీదుగా సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులు, చేతి వృత్తులకు ఆదరణ తగ్గిపోయి ఆర్థిక ఇబ్బందు, సామాజికంగానూ అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని వారికి ఉడతా భక్తి సాయంగా శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, తన వంతు తాను కూడా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలియజేసారు. ఈ దేవాలయానికి వాద్య సలహాదారులుగా ఉన్నలేబూరు శ్రీనివాసులు, మాధవి, ఆలయ ఆస్థాన వాద్య విధ్వాంసులు లేబూరు సాయి, లేబూరు సాయి నవీన దంపతులను దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల సౌజన్యంతో 5 వేల రూపాయిలు కలిపి పది వేల రూపాయిలు ఆర్థిక చేయూతను అందించారు. కార్యక్రమం నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు, తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ ఆలయ విద్వాంసులుగా నియమించబడిన లేబూరు సాయి, లేబురు సాయి నవీన్ దంపతులను అభినందించారు. శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ అనేక ధార్మిక సామాజిక కార్యక్రమాలను చేస్తూ ముందుకు వెళ్తుందని, దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాలను జరుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా నాదస్వర కళాకారులు చేసిన నాదస్వర కచ్చేరి అలరించింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, రూపేష్ శర్మ, శ్రీరామసేన అధ్యక్ష కార్యదర్శులు హరీష్ రెడ్డి, శివ, సభ్యులు దినేష్, వంశీ, గురు ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు...

ఇద్దరు యువకులు దుర్మరణం

శాంతిపురం, జూన్ 23 ప్రభాతవార్త :



కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో మండలంలోని కడపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రాళ్లబూదుగూరు పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. శాంతిపురం మండలం బోయనపల్లికి చెందిన నాగభూషణం కుమారుడు శివరాం (23) బుల్లెట్ వాహనంలో కుప్పంకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో బోయనపల్లికి చెందిన మురుగేష్ కుమారుడు లోకేష్ అలియాస్ బాలు (23) పిఇఎస్ సమీపంలోని డిగ్రీ కాలేజ్‌లో పరీక్షలు రాసి ఇంటికి వచ్చేందుకు వేచి ఉన్నాడు. దీంతో శివరాం లోకేష్‌ను తన టు వీలర్‌లో ఎక్కించుకుని బయలుదేరాడు. కడపల్లి వద్ద కుప్పం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. దీంతో శివరాం అక్కడికక్కడే మృతి చెందాడు. లోకేష్‌ను కుప్పం పిఇఎస్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.శివరాం తల్లిదండ్రులకు ఒకే కుమారుడు. అతను కూడా అకాల మృతి చెందడం పట్ల వారి తల్లిదండ్రులు కనీ న్నటిపర్యంతమయ్యారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో బోయనపల్లిలో విషాదం నెలకొంది.

## అంతర్జాతీయ ఒలంపిక్ డే పురస్కరించుకుని ఒలంపిక్ రన్

తిరుపతి (క్రీడా), జూన్ 23 ప్రభాతవార్త :




అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుండి టౌన్ క్లబ్ వరకు తిరిగి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఒలంపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ జిఎస్టి అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.జె ప్రసాద్ ఐఆర్ఎస్ గౌరవ అతిధులుగా డా॥రామచంద్ర హాస్పిటల్ ప్రత్యేక ఆహ్వానితులుగా డాలర్స్ గ్రూప్ చైర్మన్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఏజే ప్రసాద్, డాక్టర్ రామచంద్ర జెండా ఊపి ప్రారంభించగా డాక్టర్ సి. దివాకర్ రెడ్డి ఒలంపిక్ టార్చ్ తీసుకోగా తిరుపతి ఒలంపిక్ రిజిస్ట్రేషన్ అధ్యక్షులు డా. వై. ప్రవీణ్ ఒలంపిక్ టార్చ్ వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ కాన్స్టిట్యూషన్ కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి జె. సాయి కుమార్, డిఎస్‌డిఓ చీఫ్ కోర్ట్ సయ్యద్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, కిరణ్, శివప్రసాద్, రత్నాకర్, విజయ్ కుమార్, రెడ్డప్ప, సత్యనారాయణ కైలాష్ ఎన్ఐఎస్ కోచ్‌లో హాకీ కోచ్ మాలిని, చక్రవర్తి, హిందూజా, ప్రేమ్‌నాథ్, వినోద్, గోపి, వంశీ, హరి తదితరులతో పాటు నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు ఎన్‌వి హై స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఒలంపిక్ స్టేషన్ అధ్యక్షులు డా.వై. ప్రవీణ్ మాట్లాడుతూ ఆగష్టు 29వ తేది జరగబోయే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా మొత్తం సుమారు 25 క్రీడ పోటీలను నిర్వహించి ఆ రోజు బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. అదే రోజున శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు మాజీ హాకీ భారతదేశ కెప్టెన్ జ్ఞాన్ చంద్ విగ్రహాన్ని ప్రతిష్టించడం జరుగుతుందని అన్నారు.

## మానవ సేవే..మాధవ సేవ

-లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 23 ప్రభాతవార్త:



మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ సేవలందిస్తోందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు.గురువారం తిరుచానూరులోని నవజీవన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నడకదారిలో వెళ్లే భక్తులకు టిటిడి భద్రత కల్పించాలి

-బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 23 ప్రభాతవార్త:



తిరుమలకు కాలినడకన వస్తున్న శ్రీవారి భక్తులకు వన్య మృగాల నుండి భద్రత కల్పించాల్సిన బాధ్యత టిటిడిపై ఉందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి తిరుమలకు వెళ్లే మెట్ల మార్గంలో చిరుతపులి దాడిలో తీవ్ర గాయాలపాలైన చిన్నారి కౌశిక్ తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.శుక్రవారం ఉదయం ఆయన ఆసుపత్రికి వెళ్లి ఆ బాలుడిని పరామర్శించి,అక్కడ ఉన్న డ్యూటీ డాక్టరుతో మాట్లాడి కౌశిక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.చిన్నారి కౌశిక్‌కు మెరుగైన వైద్య మందిస్తున్నామని, ప్రాణాపాయం తప్పిందని అక్కడి వైద్యులు తెలిపారు. అనంతరం ఆయన బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి ఏమీ కాదని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నడక దారిలో వస్తున్న భక్తులకు అదనపు భద్రత కల్పించి భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా అటవీశాఖ అధికారులు,టిటిడి అధికారులు పథకం ప్రకారం ప్రణాళిక సిద్ధం చేయాలని,భక్తులకు ఎటువంటి ప్రాణాపాయం కలగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.